www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 13 మార్చి 2023
5
చిత్తూరు



నేటి 'స్పందన' రద్దు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 13న జిల్లా సచివాలయంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా నలు మూలల నుండి తమ సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా కేంద్రానికి వ్యయప్రయాసలకు ఓర్చి అర్జీదారులు రావద్దని కలెక్టర్ తెలిపారు.

పట్టభద్రుని ఓటు రేటు రూ.500

- విచ్చలవిడిగా కొనుగోలు చేసిన వైసిపి
- నైతికంగా ఓడిపోయిన అధికార పార్టీ
- పట్టణాల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పల్లెల్లో సర్పంచుల ద్వారా పంపిణీ
- సహకరించిన వాలంటీర్లు
- కొన్ని ప్రాంతాల్లో ఎదురు దెబ్బ

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ఎన్నో వ్యయప్రయాసలు ఓర్చి చదువుకుని పట్టా పొందిన పట్టభద్రుని ఓటుకు అధికార పార్టీ వైసిపి రూ.500లకు భేరం పెట్టింది. గ్రామాలు మొదలు.. పట్టణాల వరకు ఓటరుగా నమోదైన వారికి డబ్బులు ఎరవేసి కొనుగోలు చేసింది. మచ్చలేకుండా జరుగుతున్న ఎంఎల్‌సి ఎన్నికలకు వైసిపి మకిలి పూసింది. కాంట్రాక్టుల ద్వారా, మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బులు యథేచ్ఛగా పంపిణీ చేసింది. తిరుపతి వంటి ప్రాంతాల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి మద్దతుదారులు కొన్ని ప్రాంతాల్లో అడ్డుకున్నా.. ఎక్కువ ప్రాంతాల్లో పంపిణీ పూర్తి చేశారు. ఇదిలా ఉంటే వైసిపి ఇస్తున్న డబ్బులు కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు తిరస్కరించారు. తద్వారా తమకు విజ్ఞత ఉందని నిరూపించారు.

పట్టభద్రులు, టీచర్ల స్థానానికి జరిగే ఎన్నికలు ఎప్పుడూ నిజాయితీగా జరుగుతాయి. మేధావులు ఎన్నికయ్యే ఈ స్థానానికి ఎన్నడూ డబ్బుల పంపిణీ ఉండేది కాదు. అందుకే ఈ స్థానాలకు ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వారు ఎన్నికవుతారు. ఎక్కువగా మధ్యతరగతికి చెందిన ఉపాధ్యాయులే ఈ స్థానానికి ఎన్నికవుతారు. గడిచిన మూడు ఎన్నికల్లోనూ ఇదే నిరూపితమైంది. ప్రజాపక్షానికి చెందిన, పోరాడే గొంతుకలు ఈ స్థానాల్లో ఎన్నికయ్యి సమాజానికి ఎన్నో విలువలు నేర్పారు. అయితే ఈ చరిత్రకు అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మకిలి అంటించింది. తూర్పు రాయలసీమ ప్రాంతానికి ఒకమద్యం వ్యాపారస్తునిని పోటీలో నిలబెట్టింది. అందులో వచ్చిన డబ్బుతో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పట్టభద్రుల ఓటును రూ.500లకు భేరం పెట్టి కొనుగోలు చేసింది. దీంతో ఎంతో పవిత్రంగా జరగాల్సిన ఈ ఎంఎల్‌సి ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసి చెదలు పట్టించింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా రెండు రోజులు డబ్బులు పంపిణీ చేశారు. పట్టభద్రుల ఓటుకు రూ.500లపంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచుల ద్వారా, నగరాల్లో కార్పొరేటర్లు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు దగ్గరుండి ఈ పంపిణీని చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి ప్రతిచోటా ఈ తంతు సాగింది. అర్ధరాత్రి రెండు గంటల వరకు పంపిణీ చేస్తూనే ఉన్నారు. పట్టభద్రులు ఎక్కడున్నానే విషయాన్ని వాలంటీర్లు నాయకులకు జాబితాలు చేర్చారు. కాగా కొన్నిప్రాంతాల్లో రూ.500లు ఇవ్వడంతో తమకు వద్దని ఓటర్లు తిరస్కరించడం కొసమెరుపు.

పోలింగ్‌కు పటిష్టమైన బందోబస్తు

డిఎస్‌పి శ్రీనివాసమూర్తి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిన్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి తెలిపారు. జిల్లాలో మొత్తం 33 పోలింగ్ కేంద్రాలున్నాయని, ఇందులో 16 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ఆ పోలింగ్ కేంద్రాలలో పోలీసు బలగాలతో పాటు ఏపిఎస్పీ బలగాలను కూడా నియమించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఎలక్షన్ నియమావళి ప్రాకారం పోలింగ్ కేంద్రాలకు 100మీటర్ల వరకు ప్రజలు ఎవరు ఉండకుండా చర్యలు, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదని బహిరంగ ప్రాంతాలలో ఎటువంటి సమావేశాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది గుర్తింపుకార్డు కలిగిన ఏజెంట్లను మాత్రమే లోనికి అనుమతించాలని, ఎవ్వరు కాని పోలింగ్ రూమ్ లోనికి ఇంకు, వాటర్ బాటిల్, మొబైల్స్, ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకుపోకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. క్యూలైన్లను జాగ్రత్తగా చూసుకోవాలని ఓటర్లను తరవుగా చెక్ చేసిన తరువాతనే లోనికి అనుమతించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేసి స్ట్రాంగ్ రూమ్ నుండి పోలింగ్ కేంద్రం వరకు బ్యాల్లట్ బాక్స్‌లకు ఎస్కార్ట్ చేసే విధంగా ఏర్పాటు చేసి, 12 పోలీస్ రూట్ మొబైల్‌లలో ఒక్కో రూట్ మొబైల్‌కి ఎస్ఐ స్థాయి అధికారినిని ఇంచార్జ్‌గా నియమించి మొత్తం 48మంది సిబ్బందితో ఎన్నికలు జరుగే ప్రాంతాలలో ఎలాంటి ఘటనలు జరగకుండా నివారణ కొరకు పెట్రోలింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 5 స్ట్రైకింగ్ ఫోర్స్‌లో సిఐ స్థాయి అధికారిని ఇంచార్జ్‌గా నియమించి మొత్తం 25మంది సిబ్బందితో నిరంతరం నిఘా ఉన్నాయని తెలిపారు. 1 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంకు చిత్తూరు డిఎస్‌పి ఇంచార్జ్‌గా ఉండి, ప్రతి మండలంలో తిరిగి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నివారించడానికి ప్రత్యేకచర్యలు తీసుకున్నామన్నారు. అదనంగా ఎంసిసి టీములను ప్రతి మండలానికి నియమించి నిరంతరం ఎన్నికలు జరుగు ప్రాంతాలను పర్యవేక్షించేలా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్‌వి సెట్‌లోని బ్యాలట్ రిసెప్షన్ సెంటర్ వద్ద 6 కౌంటర్లను ఏర్పాటు చేశామని, ఈ కౌంటర్ వద్ద ముగ్గురు డిఎస్పీలు, ఐదుగురు సిఐలు, ఇద్దరు ఆర్‌ఐలు, ఏడుగురు ఎస్‌ఐలు, 55 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసామని తెలియజేశారు. ఏ రాజకీయ పార్టీ వారు కూడా ఓటర్లను తమ సొంత వాహనంలో పోలింగ్‌కేంద్రాల వద్దకు తీసుకొని రాకూడదు, ఇలాంటివి జరిగితే తీసుకోని వచ్చిన వాహనాన్ని సీజ్‌చేసి వాహనదారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్ రోజున ప్రిసైడింగ్ ఆఫీసర్ మినహా ఎవరు పోలింగ్ బూత్‌లోనికి ప్రవేశించకూడదని అన్నారు. తమ పార్టీ వారు గెలిచారని ఎటువంటి ముందస్తు సంభారాలు జరుపుకోకూడదు. ముఖ్యంగా అభ్యర్థులు ఎవరూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకూడదని అలా బలవంతంగా మద్యం, డబ్బులు ఇతర వస్తువులను ఇవ్వజూపినా అది నేరం కింద పరిగణింపబడుతుందని, దీనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ప్రలోభాలకు ఎవరైనా గురిచేస్తే ఎలక్షన్ కమిషన్ వారికి గానీ, డయల్ 100కు లేదా చిత్తూరు పోలీస్ వాట్స్ యాప్ నెంబర్ 9440900005కు సమాచారం ఇస్తే తగినచర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

నేడే మండలి పోలింగ్

బరిలో పట్టభద్రులు 22, ఉపాధ్యాయులు 8
ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు
ఓటు హక్కును వినియోగించుకోనున్న
3,81,181, పట్ట భద్రులు, 27,694 ఉపాధ్యాయులు



పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎంతో ఉతక్మంగా సాగుతున్న శాసన మండలి ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శాంతియుత వాతావరణంలో పారదర్శంగా ఎన్నికలు నిర్వహించేలా పోలింగ్ సిబ్బందికి రెండు దఫాలు శిక్షణ ఇచ్చారు. ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకొనేందుకు ఎన్నికల కమిషన్ నిర్ధేశించిన గుర్తింపుకార్డు తీసుకుపోవాల్సి ఉంటుంది. సోమవారం ఉదయం 8 గంటల నుండీ సాయంత్ర నాగులు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజవర్గం నుండీ 22 మంది, ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి 8మంది పోటీ చేస్తున్నారు. జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 54,152 కాగా ఇందులో పురుషులు 35,189, మహిళలు 18,960, ఇతరులు 3 ఉన్నారు. గత ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 69 పోలింగ్ కంద్రాల్లో 41 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఈకేంద్రాల్లో ప్రశాతంగా పోలింగ్ జరిగే వన్‌ప్లైస్ త్రీ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ సిబ్బంది ద్వారా 97శాతం ఓటర్ స్లిప్పు పంపిణీ పూర్తి చేసిన అధికారులు పోలింగ్ కేంద్రల వద్ద కూడా ఓటరు స్లిపులు పంపిణీ చేసేందుకు సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పట్టభద్రుల ఓటింగ్ కోసం 287 బ్యాలెట్ బాక్సులు ఉపయోగిస్తున్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి బరిలో 8మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 3,887, పురుషులు 2,341, మహిళలు 1,546 మంది ఓటర్లుగా ఉన్నారు.

31 పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడి ఎన్నిక కోసం పోలింగ్ జరగనుంది. ఏడు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. 40 బ్యాలెట్ బాక్సులు ఉపాధ్యాయ ఓటర్ల కోసం వినియోగిస్తున్నారు. పోలింగ్ కోసం 452 మంది పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు ఎన్నికల విధుల కోసం నియమించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన పెన్నుతో మాత్రమే బ్యాలెట్ పేపర్‌తో మార్క్ చేయాల్సి ఉంటుంది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించడంతో పాటు సూక్ష్మపరిశీలకులను నియమిస్తున్నారు.

అభ్యర్థులు వీరే...

ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజవర్గ శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రుల స్థానానికి 22, ఉపాధ్యాయ స్థానానికి 8మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. **పట్టభద్రుల స్థానానికి** కంచర్ల శ్రీకాంత్ టిడిపి, శాంప్రసాద్‌రెడ్డి వైఎస్‌ఆర్‌సిపి, దయాకర్‌రెడ్డి బిజెపి, స్వతంత్ర అభ్యర్థులుగా జైపాల్, అంకయ్య చౌదరి, భాస్కరరావు, కరుణానిధి, కిరణ్ దశరన్న, యోహెూను, వీరభద్రాచారి, డోడ్ల శ్రీహరి, నక్కా దినేష్‌యాదవ్, సామ్యూల్ మొజస్, అభినవ్ విష్ణు, పూసల రవి, పాలంకరెడ్డి, బుస్సా రాజేంద్ర, చంద్రశేఖర్, మహేందర్‌రెడ్డి, జాలరావు, వీగడ వెంకటేశ్వరరెడ్డి (పిడిఎఫ్) సరిత.

ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు

బ్రహ్మానందం, గుర్రం శ్రీ రామమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, ధనంజయ శివయోగి, పర్వతరెడ్డి, పొక్కిరెడ్డి బాబురెడ్డి (పిడిఎఫ్) రమణారెడ్డి, అనసూయ.

ప్రలోభ పెడితే డయిల్ 100

వాట్సాఫ్ 94409 00005 నెంబర్‌కు ఫిర్యాదు

ఎంఎల్‌సి ఎన్నికలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే డయిల్ 100, 94409 00005 ఫోన్‌కు ఫిర్యాదుచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎస్పీ తెలియజేశారు. పోలీస్‌శాఖ గుర్తించిన 16 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేస్తున్నారు. రౌడీ షీటర్లను బైండ్ ఓవర్ చేసుకోవడంతో పాటు ప్రతి మండలంలో మొబైల్ పార్టీని నియమిస్తూ ఎస్‌ఐని ఇన్‌చార్జిగా నియమిస్తున్నారు. ఓటర్లను వాహనాలల్లో తరలిస్తే వాహనాలను సీజ్ చేసేందుకు పోలీసులు పూనుకుంటున్నారు. మద్యం తరలింపును అడ్డుకొనేలా చెక్‌పోస్టుల వద్ద గట్టిబందో బస్తు ఏర్పాటు చేయడంతో పాటు వాహన తనిఖీలు చేపడుతున్నారు.

జిల్లా వారీగా పోలింగ్ కేంద్రాలు ఓటర్లు

చిత్తూరు జిల్లా- పోలింగ్ స్టేషన్‌లు : 69, ఓటర్లు: పురుషులు 35,189, స్త్రీలు 18,960, ఇతరులు 3, మొత్తం ఓటర్లు 54,1524.
తిరుపతి జిల్లా - పోలింగ్ స్టేషన్‌లు : 101, ఓటర్లు: పురుషులు 53,435, స్త్రీలు 33,494, ఇతరులు 12, మొత్తం 86,941

ఉపాధ్యాయ ఎన్నికల వివరాలు

చిత్తూరు జిల్లా - పోలింగ్ స్టేషన్‌లు : 31 ఓటర్లు, పురుషులు 2341, స్త్రీలు 1546, ఇతరులు 0, మొత్తం ఓటర్లు 38874
తిరుపతి జిల్లా -పోలింగ్ స్టేషన్‌లు : 37, ఓటర్లు: పురుషులు 3604, స్త్రీలు 2528, మొత్తం 6132



శాసన మండలి ఓటింగ్ ఇలా..



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికలకు ఈనెల 13వ తేదీన ఓటింగ్ జరగనుంది. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఈ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. సాధారణ ఎన్నికల్లో ముద్రణా పద్ధతిలో ఓటు వేస్తారు. శాసన మండలి ఎన్నికల్లో 'అంకెల' పద్ధతిలో ఓటు వేయాల్సి ఉంటుంది. సాధారణ ఎన్నికల్లో కేవలం ఎంపిక చేసిన అభ్యర్థికి కేటాయించిన గుర్తుపై మాత్రమే ఓటువేస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్లో అభ్యర్థులందరికీ ఓటు వేసే హక్కు ఉంటుంది.

ఉదాహరణకు...

వ.సం	అభ్యర్థి పేరు	ప్రాధాన్యతాసంఖ్య
1	రామయ్య	1
2	భీమయ్య	3
3	సోమయ్య	2
4	సీతయ్య	8
5	కల్పన	4
6	ఆనంద్	7
7	కుమార్	10
8	లక్ష్మి	5
9	సుకుమార్	9
10	మీనాక్షి	6

ఓటు వేసే విధానం ఇలా...

- ✓ బరిలో ఉన్న అందరి అభ్యర్థులకు ఓటు వేయవచ్చు.
- ✓ సిబ్బంది ఇచ్చిన 'వైలెట్' (ఊదా రంగు గల స్కెచ్‌పెన్‌తోనే ఓటు వేయాలి.
- ✓ కేవలం అంకెలను (1,2,3,...) మాత్రమే వేయాలి.
- ✓ ప్రాధాన్యత అంకె '1' తప్పని సరిగా ఉండాలి.
- ✓ అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో మాత్రమే అంకెను వేయాలి.
- ✓ ఎంపిక చేసుకున్న అభ్యర్థికి '1' సంఖ్య ఇచ్చిన తర్వాత మిగిలిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో సంఖ్యలు (2,3,4,...) సూచించవచ్చు.
- ✓ '1' అంకె ఉంటేనే బ్యాలెట్ను పరిగణలోకి తీసుకొంటారు.

ఇలా వేస్తే ఓటు చెల్లదు...

- ✗ సిబ్బంది ఇచ్చిన స్కెచ్‌పెన్‌తో కాకుండా ఇతర పెన్నులు ఉపయోగిస్తే ఓటు చెల్లదు.
- ✗ ప్రాధాన్యత సంఖ్య '1'ని ఒక అభ్యర్థి కన్నా. ఎక్కువ మందికి ఇస్తే ఓటు చెల్లుబాటు కాదు.
- ✗ ఓటును (1,2,3,...) అంకెల్లో కాకుండా రాత పూర్వకంగా (ఒకటి, రెండు, మూడు...) అని సూచిస్తే ఓటు చెల్లదు.
- ✗ ఒకే అభ్యర్థికి రెండు అంకెలు (1,2) వేయకూడదు.
- ✗ మొదటి ప్రాధాన్యత కింద అంకె '1' వేసిన, తర్వాత ఇతర అభ్యర్థులకు వేలి ముద్రలు, సంతకాలు చేయకూడదు,
- ✗ అంకెల్లో కాకుండా 'టిక్కు', 'ఇంటు' మార్కులు పెడితే ఓటు చెల్లదు.
- ✗ గడిలో కాకుండా మధ్యగీతలో అంకెను వేస్తే ఓటు చెల్లుబాటు కాదు.

అధికార పార్టీ ఆగడాలపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

చిత్తూరుఅర్బన్: ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని అధికారి పార్టీ ఆగడాలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారబలంతో నకిలీ ఓట్లు, డబ్బు పంపిణీ అరికట్టేందుకు యుద్ధప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలలో అధికారపార్టీ పెద్ద ఎత్తున చట్టవిరుద్ధ, అక్రమ పద్ధతులకు పాల్పడుతున్నట్లు జిల్లాలో అనేక ప్రాంతాల నుంచి సమాచారం అందుతుదని, ఓటర్లే స్వయంగా తెలియజేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అధికార పార్టీ నేతలు పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏజెంట్లు, పోలింగ్ కేంద్రాలవద్ద ఆటంకాలు సృష్టిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని వీటిని అరికట్టేందుకు ఎన్నికల యంత్రాగం చర్యలు తీసుకోవడంతో పాటు, గట్టి నిఘా ఉంచాలని కోరారు. ఆధునిక సాంకేతిక, రవాణా సౌకర్యాలను ఉపయోగించుకొని ఓటర్లకు నేరుగా డబ్బులు చేరవేస్తున్నారు. దీనికి వాలంటీర్లను కూడా ఉపయోగిస్తున్నారని, ఇందుకు సంబంధించి కొన్ని ఫోటోలను, డాక్యూమెంట్సు, వీడియోలను కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. విస్తతంగా డబ్బు పంపిణీ, బహిరంగంగా జరుగుతున్నా ఎక్కడా ఎన్నికల యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవడం లేదని పోలీసుకు ఫిర్యాదులిచ్చినా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థ నవ్వులపాలు కాకుండా ఉండాలంటే ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టభద్రుల ఎన్నికల్లో డబ్బులు పంచి

వైసిపి ఓటమిని అంగీకరించింది

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు



ప్రజాశక్తి- తిరుమల: రాష్ట్రంలో ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన నిధుల అభివద్ధి తప్ప, రాష్ట్రంలో అభివద్ధి జరగలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు అన్నారు. వీఐపీ ప్రారంభ విరామదర్శన ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024 సంవత్సరంలో అధికారంలోకి వచ్చే దిశగా జనసేనతో కలసి అధికారంలోకి వస్తామన్నారు. డబ్బులు కోసం స్కాంలు చేసిన కేసిఆర్ కుమార్తే అయినా సిసోడియా అయిన చట్టంముందు ఒక్కటేనని ప్రజాక్షేత్రంలో శిక్షింపబడుతారని ఆయన జ్యోష్యం చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు, నగదు పంపిణీతో వైసిపి నైతిక ఓటమిని అంగీకరించిందని అన్నారు. తిరుమలలో పెంచిన వసతి గదుల ధరలను వెంటనే తగ్గించాలని, మరోసారి చలో తిరుపతి అనే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈప్రభుత్వం హయాంలో దేవాదాయశాఖను దేవాదాయ శాఖగా మార్చే ప్రవత్తి కనబడుస్తోందని అన్నారు. తిరుమలలో ఎక్కడా పరిశుభ్రత, పవిత్రత లేదని భక్తులు చెపుతున్నారని, వెంటనే భక్తులకు ఆధ్యాత్మిక భావన వచ్చేలా టిటిడి చర్యలు తీసుకోవాలని కోరారు.

తిరుమల జేఈవోను నియమించాలి

టిటిడి పాలక మండలి తీరుపై మండిపడ్డ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో అధికార వికేంద్రీకరణ చేసి జేఈవోను నియమించాలని ఉమ్మడి రాష్ట్రహైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక న్యాయమూర్తిని అని కూడా చూడకుండా స్వామివారిని చూడాలన్నా ఆలయంలో సిబ్బంది తోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవి.వేణుగోపాల్, రాజోలు నియోజకవర్గ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, సినీనటి లయ స్వామివారి సేవలో పాల్గొన్నారు. వీరికి అధికారులు స్వాగతం పలికి దర్శనఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

అధికార పార్టీ ఓటుకు నోటు

- అడ్డుకున్న సిపిఎం నాయకులు
- పట్టుకుని అప్పజెప్పినా వదిలేసిన పోలీసులు



తిరుపతిలోని సుందరయ్యనగర్‌లో డబ్బులు పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఎలాగైనా గెలావాలనన ఉద్యేశంతో తిరుపతి నగరంలో సుమారు 10వేల దొంగ ఓట్లు నమోదు చేసిన విషయం తెలిసిందే... ఆదివారం వైసిపి శ్రేణులు ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసే కార్యక్రమం వేగంతం చేశారు. నగరంలోని సుందరయ్యనగర్, యశోదానగర్‌లో వాలంటీర్లతో కలిసి వైసిపి కార్యకర్తలు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్లకు రూ.500లు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటర్లకు రూ.5వేలు పంపిణీ చేస్తుండగా చైతన్య, అరుణ్ అనే వ్యక్తులను సిపిఎం కార్యకర్తలు గుర్తించి, డబ్బుల పంపిణీని అడ్డుకున్నారు. అనంతరం వారిని పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. అయితే పోలీసులు వెంటనే వైసిపి కార్యకర్తలను, వార్డు వాలంటీర్లను వదిలిపెట్టేశారు. వారు దర్జాగా బయటకు వచ్చేశారు. దీంతో సిపిఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ వైసిపి నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడానికి కుట్రలు చేస్తోందన్నారు. ఇంత నిర్భయంగా వారు డబ్బులు పంపిణీ చేయడం, పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు జరగకుండా వైసిపి నేతలు ఓటర్లను బెదిరిస్తున్నారని విమర్శించారు. దొంగ ఓట్లు ఉన్నవారిని కూడా ఓటింగ్‌కు వచ్చేలా చేస్తున్నారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ దొంగఓట్లు వేయకుండా కఠినచర్యలు తీసుకోవాలని, వైసిపి అరాచకాలను నివారించాలని డిమాండ్ చేశారు. డబ్బు పంపిణీ చేస్తున్నవారిని పోలీసులకు పట్టిస్తే ఎలా వదిలేస్తారని ప్రశ్నించారు. మేధావులు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు జరుగుతున్న పరిణామాలను ఆలోచించాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు జిబిఎస్.మణ్యం, నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, డివైఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.జయచంద్ర, బుజ్జమ్మ, రమణ యాదవ్, వేణు, ఎన్‌డి శ్రీను పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కందారపు మురళి

నగరిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు దుర్మరణం
- కారుపైకి దూసుకెళ్లిన ట్యాంకర్
- మృతుల్లో ఇద్దరు సింగపూర్ నుంచి వచ్చిన భార్యాభర్తలు
- మరొకరు పార్ట్‌టైం డ్రైవర్‌గా పనిచేసే విద్యార్థి



మృతుడు యువరాజన్



కారులో ఇరుక్కున్న మృతులు

ప్రజాశక్తి- నగరి : చిత్తూరు జిల్లా నగరి మున్సిపాలిటీ ధర్మాపురం వద్ద ఆదివారం ఉదయం ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివారలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన యువరాజన్ (42), నాగజ్యోతి (42) భార్యాభర్తలు. వీరు ఉద్యోగ రీత్యా సింగపూర్ ఉంటూ సింగపూర్ సిటిజన్ షిప్ తీసుకున్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంతో పాటు పలు ప్రాంతాలు చూడానికి సింగపూర్ నుంచి టూరిస్ట్ వీసాపై ఆదివారం వేకువజామున చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. ఓలా క్యాబ్‌యాప్ ద్వారా తిరుమలకు వెళ్లడానికి క్యాబ్ బుక్‌చేసుకున్నారు. ఈ మేరకు క్యాబ్ డ్రైవర్‌గా ఇళంగోవన్ (20) కారులో వారిని తీసుకొని తిరుమలకు బయలుదేరాడు. మార్గమధ్యంలో నగరి మున్సిపాలిటీ ధర్మాపురం వద్ద వీరు వెళుతున్న కారును ఎదురుగా వచ్చిన ట్యాంకర్ ఢీకొని కారుతో పాటు రోడ్డుపక్కనే పల్లపు ప్రాంతంలో ఉన్న పచ్చికబైళ్లలోకి దూసుకుపోయింది. కారులో ఉన్నవారు కారుతో సహ నలిగిపోవడంతో అక్కడికక్కడే మతిచెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ ద్వారా కారును బయటకు లాగి అందులోని మతదేహాలను వెలుపలకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న ట్యాంకర్ డ్రైవర్‌పై పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు.

కారును, ట్యాంకర్‌ను వేరుచేస్తున్న పోలీసులు



బాట గంగమ్మ సేవలో సినీ యాక్టర్



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: గంగమ్మ జాతర శుభ సందర్భంగా చిత్తూరు జిల్లా సినీ యాక్టర్ మన్యం కృష్ణ స్థానిక గ్రామ దేవత అయిన బాట గంగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు కండువా కప్పి పూలమాలవేసి స్వాగతం పలికారు. అనంతరం దర్శనార్థం అర్చకులచే పూజలు నిర్వహించి ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని యువకులు అధిక సంఖ్యలో ఆయనతో ఆటోగ్రాఫ్, సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం సినీ యాక్టర్ కృష్ణ మాట్లాడుతూ నేను హీరోగా నటించిన సినిమాలు చూసి నన్ను ఆదరిస్తారని కోరారు. మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ మాట్లాడుతూ మీరు చేసే రెండు చిత్రాలు చాలా అద్భుతంగా ఉన్నాయని మన జిల్లాలో ఒక హీరోగా ఉండి కొనసాగడం మాకెంతో సంతోషంగా ఉందని ఆయన ముందు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, సినీ యాక్టర్ కిషోర్, డ్యాన్స్ మాస్టర్ సుబ్బు, జి.సి.పల్లి సుబ్రహ్మణ్యం, ఆలపల్లి సుబ్బు, బురిశెట్టిపల్లి చలపతి, మండలంలోని సినీ అభిమానులు హాజరయ్యారు.

మహిళాపోలీస్‌కు ఆర్థిక సాయం



ప్రజాశక్తి-నగరి: వడమాలపేట టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన నగరి మండలం బుగ్గ అగ్రహారం సచివాలయ మహిళా పోలీస్ నవీనకు రాష్ట్ర మహిళా పోలీస్ అసోసియేషన్ వారు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీనను కలిసిన వారు ఆమె ఆరోగ్య క్షేమాలను విచారించారు. అసోసియేషన్ తరపున పోగుచేసిన రూ.1.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఆమెకు అందించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మధులత, జిల్లా కమిటీ అధ్యక్షురాలు శివగామి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు శైలజ, దివ్యారెడ్డి, మండల, మునిసిపల్ సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నాబార్డ్ పనుల తనిఖీ



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నాబార్డ్ నిధులతో చేపట్టిన అభివద్ధి పనులను సమగ్ర శిక్ష క్వాలిటీ కంట్రోల్ కర్నూలు డిఇ కరెన్న ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్ క్రింద రూ.32,32,000 ల నిధులతో పాఠశాలలో అభివద్ధి పనులు పూర్తికావస్తున్న నేపథ్యంలో పనులు ఏ విధంగా జరిగాయి, నాణ్యతగా చేశారా అన్న విషయాలను పరిశీలించినట్లు తెలిపారు. మరమ్మతులు, పెయింటింగ్, గ్రానైట్ తదితర పనులు చేపట్టారని, ఎం బుక్స్, ఇతర రికార్డులు పరిశీలించామని అన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వర్లు, శేషాద్రి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జయహో జనతా పోస్టర్ల విడుదల



ప్రజాశక్తి-నగరి: జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు జయహో జనతా పేరిట చేయనున్న స్వచ్ఛంద సేవాకార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆదివారం స్థానిక కష్ణా మినీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అభిమాన సంఘ సభ్యుల మీట్ అండ్ గ్రీట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జూనియర్ ఎన్టీఆర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సాయిరూప్ నల్లూరి, దుర్గా ప్రసాద్ నల్లూరి జయహోజనతా పోస్టర్లను విడుదల చేసి అభిమానులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయహోజనతా స్వచ్ఛంద సేవా సంస్థలో 10వేల మందిని సభ్యులుగా చేర్చి వారి ద్వారా సేవా కార్యక్రమాలు, ప్రభుత్వానికి సంబంధించిన శుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో ఎస్వీసీఈ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జేఎన్టీయూ అనంతపురం వార్షిక ఆటల పోటీలలో తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థినీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని, కళాశాల ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని కళాశాల ఛైర్మన్ గంగిరెడ్డి తెలిపారు. జేఎన్టీయూ పరిధిలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో ఎక్కువమంది ఎస్వీసీఈ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్లు ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవరం, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రావు, కళాశాల వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని న్యాయవాది గుమ్మల్ల రాజేశ్వరరావు సూచించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం 135వ నెల ఇంటి సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా న్యాయవాది గుమ్మల్ల రాజేశ్వరరావు పాల్గొన్నారు. దివ్యాంగులు ముందుకు వస్తే వారికి ఉపాధి కల్పించేందుకు సంస్థ వ్యవస్థాపకుడు మునీర్ బాషా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి-రామకుప్పం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నియమ నిబంధనలతో ఏర్పాటు చేశారు. మండలంలో 1492 ఓట్లు ఉండగా, 72 ఓట్లు రెండుసార్లు నమోదు కావడంతో అధికారులు వాటిని తొలగించారు. ఉన్నత అధికారుల ఆదేశాలతో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పేపర్లు ఉన్నతాధికారులు తరలించారు. ఎన్నికల నియమావళితో 144 సెక్షన్ అమలులో ఉంది.

సోమల: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రెవెన్యూ పోలీసు, పంచాయతీ సిబ్బంది పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం పరిశీలించారు. పలమనేరు నుండి ప్రత్యేక వాహనంలో పోలింగ్ సామాగ్రి, పోలింగ్ విధుల సిబ్బంది, వారి వెంట పోలీసులు భద్రత కల్పించి తీసుకువచ్చారు. తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, ఎస్సైలు మారుతి, లోకేష్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, విఆర్ఓ, వీఆర్ఏలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరగనున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్ల భద్రత చర్యలను ఎన్నికల ప్రత్యేక డీఎస్పీ కష్ణమోహన్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కేంద్రం నుండి 100 మీటర్ల వరకు ఓటర్లను తప్ప ఇతరులను అనుమతించడం లేదని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అలాగే మండల కేంద్రమైన సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబం ధించి మూడు పోలింగ్ బూతులను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఎంపీడీఓ వరప్రసాద్, ఎస్ఐ మారుతీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.



సోమల



నగరి

నగరి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ సోమవారం జరగనుంది. పోలింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల యంత్రాంగం పూర్తి చేసింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటుచేశారు. మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో వీడియో చిత్రీకరణ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను నగరి ఆర్డీవో ఎస్.సుజనతో కలిసి ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగే విధంగా బందో బస్తును పోలీసులు నిర్వహిస్తారన్నారు. డీఎస్పీ రవికుమార్ ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి శిక్షణ అందించారు.

పలమనేరు: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని డిఆర్ఓ యన్.రాజశేఖర్ ఆదివారం పరిశీలించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలోని పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బ్యాలెట్ పేపర్స్, బ్యాలెట్ బాక్స్‌లు తీసుకున్న సిబ్బంది ఒకసారి పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తర్వాత డివిజన్ పరిధికి సంబంధించి రిపోర్ట్‌ను పంపించాలని ఆర్డీఓ ను ఆదేశించారు. పలమనేరు ఆర్డీఓ శివయ్య, మునిసిపల్ కమిషనర్, తహశీల్దార్లు, రూట్ ఆఫీసర్లు, పిఒ, ఎపిఒ లు, సూక్ష్మ పరిశీలకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రంలో అన్ని ఏర్పాట్లు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ బాబు, ఎంపీడీఓ ఎస్ విద్యావతి ఆదివారం తెలిపారు. సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాన్ని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు వారి ఓటు హక్కును సజావుగా వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు వినియోగించుకోవచ్చని అన్నారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఫోటో ఉన్న గుర్తింపుకార్డు, ఓటర్ వరుస సంఖ్య తీసుకొని రావాలని తెలిపారు. మండల విస్తరణ అధికారి రమేష్ పాల్గొన్నారు.



పలమనేరు

అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి-రామకుప్పం: అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు అనంతపురం రేంజ్ డిఐజి రవి ప్రకాష్ తెలిపారు. ఆదివారం రామకుప్పం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గంజాయి, నాటు సారా, ఇసుక, బియ్యం, మద్యం తదితర అక్రమ రవాణా కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల కేంద్రంలో వివాదాస్పదమైన అంబేద్కర్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాలను జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డితో చర్చించి సానుకూలంగా పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన ఉండి వాహనాలు నడపాలని, దీంతోపాటు రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరస్తులపై అప్రమత్తంగా ఉండి మొబైల్ ఓటీపీలు ఎవ్వరికీ వెల్లడించవద్దన్నారు. మోసపూరితమైన ఫోన్‌కాల్స్ వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మండలంలో క్రైమ్‌ను అణిచివేయాలని పోలీసులకు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి స్థానిక పోలీసుల పనితీరుపై సంతప్తిని వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డిఎస్పి సుధాకర్ రెడ్డి, కుప్పం గ్రామీణ సిఐ రియాజ్ అహ్మద్, ఎస్ఐ కష్ణయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాసులుది ఆత్మహత్య కాదు... ప్రభుత్వ హత్య?



ప్రజాశక్తి-గూడూరు: స్థానిక మునిసిపల్ పరిధిలోని 29వ వార్డులో గత నాలుగు సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న దందోలు శ్రీనివాసులుది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్య అని ఎ.పి.మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ పేర్కొంది. ఈ సందర్భంగా వారు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఆదివారం స్థానిక మునిసిపల్ కార్యాలయానికి తీసుకొచ్చి వారి బంధువులు, కార్మికులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తిరుపతి జిల్లా మున్సిపల్ సంఘం కార్యదర్శి బి.గోపీనాథ్ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అప్పుల వాళ్ళ బాధ తట్టుకోలేక పురుగుల మందు తాగి శనివారం నెల్లూరు హాస్పిటల్లో మతి చెందినట్లు తెలిపారు. మతుని కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల నష్టపరిహారం, అతని భార్యకు ఉద్యోగం కల్పించాలన్నారు. కార్మికులపై మునిసిపల్ కమిషనర్ అరాచకాలు అరికట్టాలని పెద్ద ఎత్తున నినాదాలతో మునిసిపల్ కార్యాలయం దద్దరిల్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సి.ఐ.టి.యు. జిల్లా నాయకులు బి.వి.రమణయ్య, ఆర్. శ్రీనివాసులు, కె.వి.పి.ఎస్. నాయకులు అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, ఎస్. ముత్యాలయ్య, సి.పి.ఐ. నాయకులు సి.హెచ్. ప్రభాకర్, ఎంబేటి చంద్రయ్య, మున్సిపల్ కార్మికులు పెంచల ప్రసాద్, మురళి, రాజేష్, రాఘవయ్య, పద్మమ్మ, సంపూర్ణమ్మ, ప్రభావతి, పెంచులమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన లక్షకుంకుమార్చన



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహించిన లక్ష కుంకుమార్చన మహోత్సవం ఆదివారంతో పరిసమాప్తమైందని ఆలయ కార్యనిర్వహణ అధికారి మునికష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, ఆలయ ఛైర్మన్ కట్టా గోపియాదవ్, ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి ప్రధాన కలశాలతో ఆలయంలో ఊరేగింపు నిర్వహించారన్నారు. ఈ మూడు రోజుల్లో 1550 మంది భక్తులు దంపతులుగా లక్ష కుంకుమార్చన సేవలో పాల్గొన్నారన్నారు.

సవాల్‌కు మేం సై..చర్చకు మీరు సిద్ధమా!

పెద్దిరెడ్డి వ్యాఖ్యల పై స్పందించిన మాజీ మంత్రి అమర్

ప్రజాశక్తి-పలమనేరు: జిల్లాలో జరిగిన అభివద్ధిపై తాము ఎప్పుడైనా చర్చకు సిద్ధమంటూ మాజీ మం త్రి అమరనాథ రెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డికు సవాల్ విసిరారు. ఆదివారం పట్ట ణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. యువనేత నారా లోకేష్ మరియు తనపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నారా లోకేష్ చేసిన తప్పుడు సమాచారం ఇచ్చి తానే మాట్లా డిస్తున్నానని అనడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. నారా లోకేశ్ పసి పిల్లాడు కాదు అని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకుని రాజకీయాల్లోకి వచ్చారు. చంద్రబాబు 14 ఏళ్లు సిఎంగా పనిచేశారు. ఏపీకి పంచాయతీ రాజ్ , ఐటీ శాఖలకు మంత్రిగా లోకేశ్ పని చేశారు, ఇప్పుడున్న మంత్రులందరు సిగ్గుతో తలదించుకునేలా ప్రజలకు సేవలందించారు.లోకేశ్‌కు తాను తప్పుడు సమాచారం ఇస్తున్నానని మంత్రి పెద్దిరెడ్డి పచ్చి అపద్దాలు మాట్లాడుతున్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ దష్టికి జిల్లా ప్రజలు తీసుకొచ్చి న అంశాలపైనే చర్చకు రమ్మన్నారని గు ర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, రవి పాల్గొన్నారు.



చర్చకు సిద్ధం ప్రతి స్పందించిన టిడిపి

చిత్తూరుఅర్బన్: చర్చకు సిద్ధమా అంటూ లోకేష్‌బాబుకు సవాలు విసిరిన మిథున్ రెడ్డి సవాలును స్వీకరిస్తున్నట్లు ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో టిడిపి నాయకులు దొరబాబు, సప్తగిరి ప్రసాద్, కోదండయాదవ్‌లు తెలిపారు. మిథున్‌రెడ్డితో చర్చకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. కార్యకర్తలు చర్చలకు వస్తారని స్థలం చెప్పాలని సవాలు విసిరారు.

డేటా సైన్సుతో అనేక అవకాశాలు

- మహిళా వర్సిటీలో వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి-క్యాంపస్: డేటా సైన్స్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి అనేక అవకాశాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో 'డేటా సైన్స్ టెక్నిక్స్' అనే అంశంపై ఆదివారం వర్క్ షాప్ నిర్వహించారు. ఏపీ స్టాటిస్టికల్ అసోసియేషన్ తొలి వార్షిక సమావేశాల్లో భాగంగా ఈ వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి బయోట్రిమ్‌కు చెందిన స్టేట్ అసిస్టెంట్ సెర్వికల్చరిస్ట్ పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వన్యప్రాణుల సంరక్షణలో డేటా సైన్స్ ఉపయోగాలు, అనువర్తనాలు వివరించారు. ఫోర్డ్ మోటార్ కంపెనీ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ టీం మేనేజర్ ఎస్. యాదవేంద్రబాబు తన ప్రసంగంలో డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలను, డేటా సైన్స్ అనువర్తనాలు, అవకాశాలు వివరించారు. ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్‌పీఎస్) అధ్యక్షుడు తిరుపతి లో డేటా సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను తన ప్రసంగంలో వివరించారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శివ పార్వతీ సదస్సు ఉద్దేశం, ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమం రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్ కుమార్ వర్మ, ఎస్వీయూ ప్రొఫెసర్ భూపతి నాయుడు, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ ఇసుపతి పాఠక్, చెన్నై ప్రెసిడెన్సీ కళాశాలకు చెందిన విశ్వనాథన్, ఎస్వీ వ్యవసాయ కళాశాలకు చెందిన నఫీజ్ ఉమర్, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ కి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.హరి మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నగరి: స్థానిక పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలోని మహానేత వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌ఛైర్మన్లు బాలన్, వెంకటరత్నం, ఎంపీపీ భార్గవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటే గౌడ ఆధ్వర్యంలో నిర్వహించారు. దివంగత మహానేత స్వర్గీయ డా.వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి జరుపుకున్నారు.

బంగారుపాళ్యం: ప్రజల కోసం ప్రారంభించిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ అని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని బోడబండ్ల గ్రామంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నగరి

సోమల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రం సోమల బస్టాండ్ కూడలిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. మాజీ సర్పంచ్ శ్రీరాములు, రాసెట్టి మధు, వేముల హరి, సాంబయ్య, చక్రపాణి, సర్పంచ్ రెడ్డప్ప, గౌస్ పీర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన సదుం బస్టాండ్ కూడలిలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు, ఘనంగా నిర్వహించారు. జడ్పిటిసి సోమశేఖర రెడ్డి, సర్పంచ్ ఉషారాణి, కష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్వేటినగరం: రాష్ట్రంలో సుపరిపాలనకు నిదర్శనం ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. వైసీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సర్పంచ్ సుందర్ రాజ్ ఆధ్వర్యంలో స్థానిక గాండ్లమిట్ట కూడలిలో కేక్‌లు కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల పార్టీ కన్వీనర్ ధనంజయ వర్మ, పొన్నుస్వామి, మురగయ్య, నాయకులు, సభ్యులు పురంధర్, అంకయ్య పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు ఆదివారం వెదురుకుప్పంలో ఘనంగా జరుపుకున్నారు. వైసీపీ మండలాధ్యక్షుడు పేట ధనంజయులురెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు బండి గోవర్ధన్ రెడ్డి, బట్టే సుబ్రహ్మణ్యం, కో-ఆప్షన్ మెంబరు వెంకటేశలు తదితరులు ఉన్నారు.

పులిచెర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివద్ధి సాధ్యమని ఎంపీపీ సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు నాలుగు రోడ్ల కోడలిలో ఆదివారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచారు. నాయకులు ఎన్ఎస్ రెడ్డి ప్రకాష్, నాథమునిరెడ్డి, రాయల్ మోహన్, చంద్రశేఖర్ రెడ్డి, విరూపాక్షి జయచంద్రారెడ్డి, ప్రతాప్ రెడ్డి, గోవిందరెడ్డి, నటరాజ, షకూర్, షౌకత్, రెడ్డి బాబుల్లా, కోదండయ్య, ఆనంద నాయుడు, పోకలచంద్ర, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సోమల, సదుంలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తింపు!

ప్రజాశక్తి-సోమల: ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సోమల, సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. అందువల్ల ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

నివాళులర్పించిన మంత్రి పెద్దిరెడ్డి



ప్రజాశక్తి-రొంపిచెర్ల: విశ్రాంత డిఎంహెచ్ఒ చంద్రశేఖర్ మతదేహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూలమాలవేసి ఆదివారం నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జడ్పిటిసి రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ శేఖర్ బాబు, నూలు రెడ్డప్ప, సర్పంచ్ జీవలత, ఇబ్రహీం ఖాన్, వైసీపీ నాయకులు కోటా వెంకటరమణ, సూర్యనారాయణ రెడ్డి, సురేందర్ నాయుడు, శ్రీధర్ బాబు, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు సన్మానం



ప్రజాశక్తి-శ్రీరంగరాజపురం: ప్రజా విప్లవ కళాకారుడు గద్దర్‌ను ఆదివారం తిరుపతిలో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం నాయకుడు కొత్తపల్లి శంకర్ మిత్రులు శాలువాతో సన్మానించారు. ఈరోజు దక్షిణ భారతదేశ 6వ కాన్ఫరెన్స్ రచయితల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రజా విప్లవకారుడు గద్దర్ గంధమనేని శివయ్య భవనంలో మన తెలుగు దేశం దళిత యువ నాయకుడు కొత్తపల్లి శంకర్ గౌరవపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామయ్య, గోవింద్ స్వామి , గురునాథం, సాయి, రమేష్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల కలయిక



ప్రజాశక్తి-నగరి: మండలంలోని ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2010-11 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. పాఠశాలకు బీరువాను వితరణగా అందించి చిరకాలం పాఠశాలలో తమ జ్ఞాపకాలను ఉపాధ్యాయులు నెమరువేసుకునేలా చేశారు. దశాబ్దం గడిచినా చదివిన పాఠశాలను మరవకుండా విచ్చేసి తమను సత్కరించిన విద్యార్థులకు గురువులు ఆశీస్సులను అందజేశారు.

ఆవులమ్మ ఆలయంలో విశేష పూజలు

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని ముద్దనపల్లి పంచాయతీ, ఆవుల కుప్పం గ్రామ సమీపంలోని పెద్ద చెరువు కట్టమీద ఉన్న ఆవులమ్మ ఆలయంలో గ్రామస్తులు విశేష పూజలు చేశారు. ఆదివారం ఆవులమ్మ విగ్రహ ప్రతిష్టాపన చేపట్టి 41వ రోజు పూర్తి కావడంతో ఉదయం వివిధ పుష్పా లతో సుదరంగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చార ణతో అభిషేకాలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పొంగళ్ళు పెట్టి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతి ఇచ్చి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తాదులకు అన్న ప్రసాదాలు పంచిపెట్టారు.



ఓటర్లకు సెలవు ప్రకటించాలి

ప్రజాశక్తి-సత్యవేడు: పరిశ్రమలో పనిచేస్తున్న గ్రాడ్యుయేట్ ఓటర్లకు సెలవు మంజూరు చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. శ్రీసిటీలోని పరిశ్రమలో పనిచేస్తున్న పట్టభద్రుల ఓటర్లకు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకుని.. అందుకు పరిశ్రమల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సెలవు మంజూరు చేయాలని కోరారు.

'దొంగ ఓట్లను ఆధారాలతో నిరూపించాం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దొంగ ఓట్లను తయారు చేసి అక్రమ పద్ధతిలో వైసీపీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ప్రయత్నాలు చేశారని, తిరుపతి నగర పరిధిలో ప్రతి డివిజన్‌ను జల్లెడ పట్టి దొంగ ఓట్లను ఆధారాలతో సహా నిరూపించామని తిరుపతి మాజీ శాసన సభ్యురాలు సుగుణమ్మ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుగుణమ్మ మాట్లాడారు. ఆధారాలతో సహా దొంగ ఓట్లను నిరూపిస్తే నిజాలను ఒప్పుకోలేని స్థితిలో వైసిపి ఉందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జరిగిన ఏ ఎన్నికల్లో అయిన దొంగ ఓట్లు వేయిస్తూ తిరుపతిని దొంగ ఓట్లకు కేంద్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకుని మేధావులుగా మసిలే వ్యక్తులు వెళ్లే శాసనమండలికి ఇలా దొంగ ఓట్లతో మండలికి వెళ్లాలని వైసిపి కుట్రకు విజ్ఞులైన పట్టభద్రులు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దొంగ ఓటును నమోదు చేసుకోవడమే ఒక నేరమని, అలా నమోదై ఓటు వేయడం మరొక నేరమన్నారు. తిరుపతి నగరంలోని పదివేల దొంగ ఓట్లను గుర్తించి అధికారుల దష్టికి తీసుకెళ్లామన్నారు. టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న కంచర్ల శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని, రెండవ ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న ఏపీటీఎఫ్ అభ్యర్థి రమణారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, రెండవ ప్రధానితో ఓటును పిడిఎఫ్ అభ్యర్థి బాబు రెడ్డికి వెయ్యాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సురేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.